## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ, అక్టోబర్ 25 : పేద ప్రజల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. బర్కత్‌పుర కర్ణాటక సాహిత్య మందిర్‌లో కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర బీష్మాదేవ్ అధ్యక్షతన బుధవారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెంకటేశ్ హాజరై మాట్లాడుతూ.. రెండవసారి అంబర్‌పేటలో అత్యధిక మెజార్టీతో గులాబీ జెండా ఎగురవేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూలిజాల గెల్వయ్య, డాక్టర్ శిరీషాయాదవ్, ఓంప్రకాశ్‌యాదవ్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి తదితరులు పాల్గొన్నారు. కాగా, కాచిగూడలోని మోతిమార్కెట్‌కు చెందిన బీజేపీ నేత ఆర్.జ్ఞానేశ్వర్‌తోపాటు పలువురు బీజేపీ నాయకులు బుధవారం రాత్రి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## మైనార్టీల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

### బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, అక్టోబర్ 25: మైనార్టీల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మౌలాలి డివిజన్‌లో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ మ్యానిఫెస్టోలో ప్రజల సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో అమీనుద్దీన్, భాగ్య నందరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటు వేయండి



ఎమ్మెల్యే మాగంటికి హారతి ఇచ్చి బొట్టు పెడుతున్న మహిళ

వెంగళరావునగర్, అక్టోబర్ 25 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. బుధవారం శ్రీనగర్‌కాలనీ డివిజన్‌లోని సోనాబాయి దేవాలయం, ఎల్లారెడ్డిగూడ, వడ్డెర బస్తీ, సుభాష్‌నగర్, హబీబ్‌బాగ్, సంజయ్ గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గోపీనాథ్ పాదయాత్రగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరిస్తూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు.

### తిరుమలలో కోలేటి దామోదర్ ప్రత్యేక పూజలు



సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని కోరుతూ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ బుధవారం తిరుమల శ్రీవారి బ్రహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో కోలేటి దామోదర్ తిరుమలలో శ్రీవారిని దర్శించుకొని, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డితో కలిసి చక్రస్నాన ఘట్టాన్ని వీక్షించారు. ఆ సమయంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి ఘన విజయం సిద్ధించాలని కోరుకున్నట్టు తెలిపారు.

–హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)

# బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి

### మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు

మహేశ్వరం/ఆర్కేపురం, అక్టోబర్ 25 : బీఆర్ఎస్‌ను ఆశీర్వదించి అభివృద్ధికి పట్టం కట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్లె రవీందర్, అల్లె శ్రీశైలం తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కరోళ్ల చంద్రయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

☞ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పరిపాలన సాగించారని మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు బీఆర్ఎస్ ఆర్కేపురం డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్క ఊర్మిళారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం మహిళా వర్కింగ్ అధ్యక్షురాలు పటేల్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# రైతన్నకు పెట్టుబడి చేయూత

- తొలగిన అప్పు ముప్పు
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు వినియోగం
- అన్నదాత సంక్షేమంలో 'రైతుబంధు' మైలురాయి



మేడ్చల్ మండలంలో సాగు చేసిన వరి పంట

మేడ్చల్, అక్టోబర్ 25 : ఉమ్మడి రాష్ట్రంలో రైతన్నకు అన్నీ తిప్పలే ఉండేవి. ప్రతి వ్యవసాయ సీజన్‌ను కష్టాలతో ఆరంభించాల్సి వచ్చేది. ప్రతిసారీ ఎదురీతే. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చేది. విత్తనాలు సకాలంలో దొరికేవి కావు. అది దాటుకుని ముందుకెళ్తే పంట చేనులో వేయడానికి యూరియా తదితర ఎరువుల కోసం ఆపసోపాలు పడాల్సి వచ్చేది. వరుసగా రెండు రోజులపాటు లైన్‌లో నిలిచి ఉంటే గానీ బస్తా యూరియా దొరకని దుస్థితి ఉండేది. పంట ఎదుగుతున్న సమయంలో కరెంట్ కోతలు, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోవడం వంటి బాధలు ఉండేవి. అవి దాటుకొని ముందుకెళ్తే గిట్టుబాటు ధర దక్కేది కాదు. చేసిన అప్పులు తీర్చలేక ఉరికొయ్యలకు వేలాడాల్సిన దయనీయ బతుకులు రైతులవి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పరిపాలన బాధ్యతలు స్వీకరించిన సీఎం కేసీఆర్ రైతు సంక్షేమంపై ప్రధానంగా దృష్టి సారించారు. కరెంట్ కోతలను నివారిస్తూ 24 గంటల విద్యుత్ కలను సాకారం చేశారు. సకాలంలో ఎరువులు, విత్తనాలను సమకూర్చారు. పెట్టుబడి సాయం కోసం రైతులు ఎవరికీ చేయి చాచకుండా చారిత్రాత్మక పథకం 'రైతుబంధు'కు శ్రీకారం చుట్టారు. రైతు సంక్షేమం కోసం తీసుకున్న సంక్షేమ కార్యక్రమాల్లో 'రైతుబంధు' ఒక మైలురాయిగా నిలిచింది.

### రూ.293 కోట్ల సాయం

మేడ్చల్ నియోజకవర్గం పట్టణాలు, పల్లెలతో కలగలిసి ఉన్నది. మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతపల్లి, ఘట్‌కేసర్, కీసర, మేడిపల్లి, కాప్రా మండలాల్లో 61 పంచాయతీలు, 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. 2018 వానాకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందివ్వడం ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 11 విడుతలుగా రైతులకు పెట్టుబడి సాయం అందింది. మొదటి నుంచి ఇప్పటి వరకు తీసుకుంటే నియోజకవర్గంలోని దాదాపు 32వేల మంది రైతులకు రూ.293.29 సాయం అందింది. 2018 యాసంగి నుంచి ఇప్పటి 2023 వానాకాలం వరకు రైతులకు అందిన సాయం ఇలా ఉన్నది.

| సంవత్సరం | రైతులు | సాయం రూ.కోట్లల్లో.. |
|---|---|---|
| 2018 వానాకాలం | 24,480 | రూ.21.73 |
| యాసంగి | 20,841 | రూ.19.58 |
| 2019 వానాకాలం | 24,244 | రూ.25.45 |
| యాసంగి | 16,479 | రూ.12.59 |
| 2020 వానాకాలం | 27,039 | రూ.30.28 |
| యాసంగి | 28,105 | రూ.31.14 |
| 2021 వానాకాలం | 29,199 | రూ.31.12 |
| యాసంగి | 30,347 | రూ.31.48 |
| 2022 వానాకాలం | 31,368 | రూ.31.56 |
| యాసంగి | 29,853 | రూ.26.79 |
| 2023 వానాకాలం | 32,000 | రూ.31.51 |

### మందు సంచులు తెచ్చుకుంటాం



మాకు అద్దెకరం పొలం ఉన్నది. ప్రతిసారి రైతుబంధు వస్తున్నది. పైసలు వచ్చిన వెంటనే మందు సంచులు తెచ్చుకుంటాం. సీఎం కేసీఆర్ సల్లంగా ఉండాలి. రైతులను ఆదుకుంటుండు. అంతకు ముందు రైతులకు సావుకార్లే దిక్కయితుండే. వాళ్ల దగ్గర అప్పులు తెచ్చుకొని, వాళ్లకే ఎంతకు చెబితే అంతకు అమ్ముకునేటోళ్లం. కేసీఆర్ వచ్చినంక ఆ బాధలు పోయినయి. దేనికి రందీ లేకుండా పోయింది. అప్పుడైతే బతకడమే కష్టంగా ఉండేది. పని లేకుండా ఉండేది. అడ్డమీదికి పోయి కూలీనాలీ చేసుకుని, బతుకుతుంటిమి. ఇప్పుడే మాకున్న ఉన్న కొద్ది పొలం పంట పండించుకుంటున్నాం. పంటలు బాగా పండుతుండటంతో ఈ చుట్టు పక్కల చేన్లలో పని దొరుకుతున్నది. రైతులకు మంచి రోజులు వచ్చినయి. అంతా ఆ సారు దయే. ఇలాంటి ముఖ్యమంత్రి మేం ఎప్పుడు చూడలేదు. మళ్లీ ఆయన వస్తేనే రైతులు, ప్రజలకు మంచి జరుగుతుంది.

*– ముక్కెర సక్కు, రైతు, జగన్‌గూడ, శామీర్‌పేట మండలం*

### గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం

తెలంగాణ రాక ముందు మేడ్చల్ నియోజకవర్గంలో కేవలం 22వేల ఎకరాల్లో మాత్రమే పంట సాగయ్యేది. తొమ్మిదేళ్లలో పెట్టుబడి సాయం అందివ్వడంతోపాటు రైతు సంక్షేమానికి తీసుకున్న చర్యలతో సాగు విస్తీర్ణం 62వేల ఎకరాలకు పెరిగింది. నగర శివారులో ఉన్న మేడ్చల్ నియోజకవర్గం లాంటి ప్రాంతంలో సాగు విస్తీర్ణం భారీగా పెరగడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలే కారణమని రైతులు, వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రైతుబంధు ఎరువులు, విత్తనాలు కొనుగోలు, దున్నకాలకు ఉపయోగపడుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ తమకు దేవుడితో సమానమని, అడగకుండానే అన్ని చేస్తున్నాడని, ఆయన వల్లే ఈ గౌరవం దక్కిందని అంటున్నారు.

### రైతన్నకు రంది లేదు



రైతన్నకు సీఎం కేసీఆర్ రందీ లేకుండా చేసిండు. మాకు రెండెకరాల పొలం ఉన్నది. పంట పంటకు పైసలు వస్తున్నాయి. దున్నకాలకు, కలుపు తీయడానికి, ట్రాక్టర్ కిరాయికి, మందు సంచులకు వాడుకుంటున్నాం. కేసీఆర్ వచ్చినప్పటి నుంచి అయితే రైతులకు మంచిగుంది. అంతకు ముందు మేం లాగోడుకు మేకలు, గొర్రెలను అమ్ముకునేవాళ్లం, సొసైటీలో, సావుకార్ల దగ్గర అప్పు తెచ్చుకునేటోళ్లం. తిరిగి మిత్తితోని కట్టాల్సి వచ్చేది. ఇప్పుడేమీ బాధలేదు. కరెంట్ కూడా బాగా ఇస్తుండు. గతంలో ఎకరా సాగు చేసేవాళ్లం. ఇప్పుడు నీళ్లున్నయి, కరెంట్ ఉన్నది. రెండెకరాల సాగు చేస్తున్నాం. ఎవరో ఏదో చెబుతారు.. అదంతా ఉత్తదే. రైతుబంధు ఇస్తుండు, పింఛన్ ఇస్తుండు ఏదో రకంగా సాయం చేస్తనే ఉన్నాడు. నాకు రైతు బంధు వస్తుంది, పింఛన్ వస్తుంది. అప్పుడైతే గిట్ల లేకుండే. మళ్లీ ఆయన(కేసీఆర్) వస్తేనే బాగుంటది. కాంగ్రెస్ వస్తే అయితే కరెంట్ సున్నా. మీటర్లు పెడతరంటా. ఎవరెన్ని చెప్పినా నమ్మలేం. మనకు కండ్ల ముంగట కన్పిస్తున్నది ఇడిచిపెట్టి, ఏం చేస్తామంటే ఎట్ల నమ్ముతాం.

*– మోతే లక్ష్మయ్య, గోసాయిగూడ, మేడ్చల్ మండలం*